ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# రావిశాస్త్రిగారు రచించిన నాటకాలు: సామాజిక దృక్పథం

కప్పల సురేశ్

పరిశోధకుడు, తెలుగుశాఖ,మానవీయ శాస్త్రాల విభాగం, హైదరాబాదు

విశ్వవిద్యాలయం,హైదరాబాదు,రంగారెడ్డిజిల్లా, తెలంగాణ.

Email:sureshbabu147147@gmail.com

సెల్:7680073973

Article Received: 10/04/2026

Article Accepted: 16/05/2026

Published Online: 18/05/2026

DOI:10.53414/Sahithyatharangini.2025.3259

## 0.ఉపోద్ఘాతం

నాటకం సమహారకళ. లలిత కళల్ని స్వీకరించి రసజ్ఞులను రంజింపచేసే కళ నాటకం. దృశ్య కావ్యమైన నాటకానికి సాహితీరంగంలో విశేషమైన, విశిష్టమైన స్థానముంది. ఏ సామాజిక ప్రక్రియ అయినా సామాజికుల అభిరుచులను, ఆలోచనలను ప్రతిబింబిస్తూ ఆయా కాలాలలోఉన్న సమస్యలను చిత్రిస్తుంది. సామాజిక ప్రయోజనాన్ని ఆశించే ప్రక్రియ నాటకం. సంఘాన్ని సంస్కరించాలన్న తపనతో అన్ని భాషలలో నాటకం పుట్టింది. తెలుగునాటకం సంఘ సంస్కరణోద్యమం నుండి శ్రీకారం చుట్టి నేటి తెలుగుభాషా పరిరక్షణోద్యమం వరకూ అన్ని ఉద్యమాలకు నాటకం తనదైన రీతిలో స్పదించింది.

నాటక ప్రక్రియ గురించి ఆర్యులు "***కావ్యేషు నాటకమ్ రమ్యమ్***" అని అలాగే "***నాటకాంతంహి సాహిత్యమని***" కొనియాడారు. నాటకమనేది సమాజ పరివర్తన కోసం, ప్రతిస్పందన కోసం, సాంఘిక చైతన్యం కోసం రచించినవి అన్న విషయాన్ని మనం గమనించాలి. అటువంటి నాటకాలు ఎంతో ఖ్యాతిని పొందుతాయి. సాంఘిక చైతన్యాన్ని ప్రబోధించిన నాటకాలలో రావిశాస్త్రి గారి నాటకాలు కూడా చెప్పుకోదగ్గది.

రావిశాస్త్రిగారు స్వయంగా నటుడు, దర్శకుడు కూడా. ఆయన రాసిన మూడు నాటకాలు 'తిరస్కృతి, నిజం, విషాదం'. నాటకాలలో ఆయన ఇచ్చే సూచనలు, వ్యాఖ్యానాలు, సన్నివేశ కల్పన

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

విషయంలో, ప్రదర్శన విషయంలో, పాత్ర నిర్మాణంలో ఆయనకున్న సునిశితదృక్పథాన్ని సూచిస్తాయి. ఆయన నవలల్లాగే అధికార దురహంకారం, యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, పీడిత, తాడిత స్త్రీలు, మధ్యతరగతి జీవితం నాటకాలలో కూడా ప్రధాన వస్తువులు. సంభాషణలద్వారా పాత్రల నేపాథ్యాన్ని చూపించగలగడం రావిశాస్త్రిగారు నాటక శిల్పంలోని ప్రత్యేకత. రావిశాస్త్రిగారు ఎన్నో కథలు, నవలలు,వివిధ వ్యాసాలు కూడా రాశారు.

రావిశాస్త్రి **నాటకాలు** మూడు . 1.*తిరస్కృతి* , *2.నిజం 3.విషాదం.* ఈ నాటకాల రచనాకాలాన్ని, ఇతివృత్తాలను, వీటిలోని సామాజిక సమస్యలను ఈ క్రింద వరుసక్రమంలో తెలియజేస్తాను.

**1.తిరస్కృతి(1957)**

నాలుగు అంకాల నాటకం. ఇది 1957 మార్చి, ఏప్రిల్ నెల భారతిలో 'వచ్చేకాలం' అనే పేరుతో అచ్చయింది. విడిగా 'తిరస్కృతి' అన్న పేరుతో 1964లో అచ్చయింది. ఈ నాటకం కూడా చాలాసార్లు ప్రదర్శితమైంది. స్త్రీపురుష సంబంధాలు, స్త్రీపురుషాధిక్య సంస్కృతిని ఎదుర్కోవడం 'తిరస్కృతి' నాటకంలో వస్తువు. ఈ నాటకాన్ని **"సంస్కృతీ సమ్మేళన నాటక పోటీలలోనూ, నెల్లూరు నెహ్రూ నాటక కళాపరిషత్తులోనూ, రాజమండ్రి లలిత కళానికేతన్ నాటక పోటీలలోనూ, ఆంధ్ర ఆర్టుథియేటర్ విజయవాడ"** వారు ప్రదర్శించడం జరిగింది.

**1.1 తిరస్కృతి నాటకం-ఇతివృత్త పరిశీలన**

కామేశ్వరి, రమణయ్య రెండవ కుమారుడైన మోహన్ బాబు మాయలో పడి గర్భవతి అవుతుంది. ఈ విషయాన్ని మోహన్ బాబుకు చెప్తే తనకు ఎటువంటి సంబంధం లేదని బుకాయిస్తాడు. రమణయ్య దగ్గర సెక్రటరీగా పనిచేస్తున్న మోహన్ బాబు స్నేహితుడైన చంద్రశేఖరం జోక్యం చేసుకొని ఈ విషయాన్ని రమణయ్యతో చెప్తానని, నీవు ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని కామేశ్వరికి ధైర్యం చెప్పి వివాహం చేయడానికి ప్రయత్నిస్తాడు. వివాహం చేసుకోమని మోహన్ బాబుని బలవంతం చేయడం అతను చేసుకోనని చెప్పడంతో, ఇది బలవంతపు వివాహమని గుర్తించిన కామేశ్వరి ఇంత బలవంతాన పెళ్ళాడిన వీడితో తన బతుకెలా తెల్లవారుతుంది అని వివాహాన్ని తిరస్కరిస్తుంది.

స్త్రీని మోసం చేయడమే కాకుండా వివాహానికి ఒప్పుకోని వ్యక్తిని, స్త్రీ కూడా తిరస్కరించే చైతన్యం, ధైర్యం వారిలో ఉందని చెప్పడమే ఈ నాటకంలోని ఇతివృత్తంగా చెప్పవచ్చును.

**1.2 తిరస్కృతి నాటకంలో చిత్రించబడిన సామాజిక సమస్యలు**

తిరస్కృతి నాటకంలో పురుషాంకార సమాజాన్ని ప్రధాన సమస్యగా చూపడం జరిగింది. ఈ సమస్య వల్ల స్త్రీలు సమాజంలో ఎన్నో అవమానాలను, ఎన్నో అమానుష కృత్యాలను భరించాల్సి వస్తున్నది. స్త్రీ ఆట బొమ్మ కాదు. వారికి ఆత్మ గౌరవం ఉంది. తనను ప్రేమించి మోసం చేసిన వ్యక్తి జులాయి వాడని తెలిసిన తర్వాత కూడా ప్రాధేయపడి పెళ్ళి చేసుకోవాల్సిన అవసరంలేదని, 'అన్యధా శరణం నాస్తి' అన్న తీరులో స్త్రీ జీవించాల్సిన అవసరం ఈనాడు లేదని చెప్పడమే ఈ నాటకం ఉద్దేశ్యం. స్త్రీలకు, పురుషులే జీవనం, జీవితం కాదని, వారికి ఆత్మగౌరవం ఉందని, వారిపై జరిగిన అఘాయిత్యాలను ఎదిరించగల ధైర్యం వారిలో ఉందని కామేశ్వరి పాత్రలో చూపించడం జరిగింది. స్త్రీలను గౌరవించని మోహన్ బాబు లాంటివారు ఉన్నారనీ చెప్తూనే, స్త్రీలకు జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దడానికి సోమనాథం, చంద్రశేఖరంలాంటి మంచి వ్యక్తులు కూడా ఉన్నారని 'తిరస్కృతి' అనే ఈ నాటకంలో సమాజం తీరును ప్రతిబింబించడం జరిగింది.

**2. నిజం (1962)**

రావిశాస్త్రి నాటకాల్లో చాలాసార్లు ప్రదర్శితమై బాగా పేరుపొందిన నాటకం 'నిజం'. ఇది ఆరు అంకాల నాటకం. గురజాడ కళాకేంద్రపు సభ్యులకి '*నిజం*'నాటకం అంకితం ఇచ్చారు. మచిలీపట్నం **'అడ్వకేట్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్'** వారు '*నిజం*' నాటకాన్ని మొట్ట మొదటగా 14 ఫిబ్రవరి 1965లో ప్రదర్శించారు.ఆ తరువాత '**శ్రీ నాట్య భారతి**' (విశాఖపట్నం) సంస్థవారు ఈ నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు.

**2. 1 '*నిజం*' నాటకం- ఇతివృత్తం పరిశీలన**

సార్వభౌమరావు పార్లమెంటుమెంబరు. ఆయన కొడుకు సుందరం అనబడే సుందరరావు ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఒకసారి సెలవులకు వచ్చినప్పుడు అనుకోకుండా తాగినమత్తులో మిత్రుడిని హత్య చేస్తాడు. విషయం తెలుసుకున్న సార్వభౌమరావు తనకుగల అధికారంతో, అబద్ధపు సాక్ష్యాలను సృష్టించి సోమసుందరం అనే యువకుడి మీద హత్యానేరం మోపుతాడు. సోమసుందరానికి ఉరిశిక్ష విధిస్తారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఉరిశిక్ష అమలు కావడానికి ముందు సీనులో లోకం అంతా నిజం పలకాలనేది తన ఆఖరి కోరికగా సోమసుందరం చెప్తాడు. అక్కడ ఉన్నవారందరినీ వారివారిజీవితాల్లో ఇకముందెప్పుడూ నిజానికి నిలబడతామని వీలైతే వాగ్దానం చేయమని అడుగుతాడు. ఈ నాటకంలోని సార్వభౌమరావు పాత్ర తరువాత నాటకాలలో, సినిమాలలో అనేక దురహంకార, దురధికార పాత్రలకి నమూనాగా నిలిచింది.

**2.2 నాటకంలో చిత్రించిన సామాజిక సమస్యలు**

రావిశాస్త్రిగారు సమాజంలో తాను చూస్తున్న అంశాలను కొన్నిటిని తీసుకొని 'నిజం' నాటకంగా మలిచారు. రాజకీయాధికారంలో ఉన్నవాళ్లు తమ స్వార్థంకోసం యంత్రాంగాన్ని, న్యాయవ్యవస్థను ఎలా ఉపయోగించుకుంటున్నారో, దీనివల్ల సమాజంలోని బడుగువర్గం ఎలా అల్లకల్లోలం అవుతున్నదో 'నిజం' నాటకం నిరూపిస్తుంది. తప్పులు చేయకపోయినా ఎందరో అమాయకులు శిక్షలు అనుభవిస్తున్నారని సోమసుందరం పాత్ర ద్వారా తెలియజేసారు. స్త్రీలు నిరాశ్రయులు అయినప్పుడు ఇష్టంలేకున్న సార్వభౌమరావు వంటి రాక్షసుల నీడలో ఉండాల్సి వస్తుందని సుశీల పాత్ర ద్వారా తెలియజేసారు. వ్యక్తి బలహీనతలతో ఆడుకొని స్వార్థంతో మధు, కృష్ణల వంటి వారితో తప్పులు చేయించడం మనకు ఈ నాటకంలో కన్పిస్తుంది. యంత్రాంగం అంతా రాజకీయాధికారంలో ఉన్నవారి ప్రయోజనం కోసం పనిచేసినప్పుడు నిజానికి ఎక్కడా చోటు ఉండదని కూడా ఈ నాటకం చెప్తుంది. దేవుడు సామన్యులకు, ధీనులకు అన్యాయం జరుగుతున్న అడ్డు పడడు అన్న ఇంకో కోణం కూడా ఈ నాటకం కన్పిస్తున్నది.

**3. విషాదం(1962)**

విషాదం ఏకాంకిక. ఒక యువతి జీవితంలో జరిగినవిషాద సంఘటనల సమాహారమే ఈ విషాధం నాటకం. ఈ నాటకాన్ని నాట్య భారతి (రిజిష్టర్డు) విశాఖపట్నం టౌన్ హాల్లో 18-11-1962వ తేదిన శ్రీ కూర్మావేణు గోపాలస్వామిగారి సమక్షాన ఈ నాటిక తొలిసారిగా ప్రదర్శించారు. ఈ విషాద నాటక ఇతివృత్తం. 'సాహితి' మాస పత్రికలో 1962వ సంవత్సరంలో సీరియల్గా వచ్చింది. 1969లో విడిగా అచ్చయింది.

**3.1 విషాదం నాటకం ఇతివృత్త పరిశీలన**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

ఈ నాటకం ఒక యువతికి సంబంధించిన కథ. ఒక యువతికి సినిమా పిచ్చి ఉండటం వల్ల ఒక యువకుడితో మద్రాసు వచ్చి మోసానికి గురై ఒక గుడ్డి పిల్లవాడికి జన్మనిస్తుంది. ఆ యువకుడు తనని వదిలి వెళ్ళిపోతాడు. ఆ విధంగా ఒంటరైన తనను ఆదుకున్న వ్యక్తి, కొడుకు కూడా ప్రమాదవశాత్తూ ఒక ఏటిలో పడి చనిపోతారు. ఆ యువతి వాళ్ళను వెతుక్కుంటూ పిచ్చిగా ఆ ఏటి ఒడ్డునే తిరుగుతుంటుంది. ఆ యువతిలోని బాధను, విషాదాన్ని గుర్తించలేని సంస్కారహీనులైన నలుగురు యువకులు ఆమెను లోబరుచుకోవడానికి ప్రయత్నం చేస్తారు.

ఆ యువతి విషాదాన్ని, నలుగురు యువకుల అనుచిత ప్రవర్తనను గుర్తించిన సబ్ ఇన్స్పెక్టర్ ఆ యువతిని వారి నుండి రక్షించి మరొక చోటికి చేరుస్తాడు. ఆ యువతికి జరిగిన విషాదాన్ని వారికి వివరించి, వార్నింగ్ ఇచ్చి వదిలిపెడతాడు.

### 3.2 నాటకంలో చిత్రించబడిన సామాజిక సమస్యలు

విషాదం అనే నాటకంలో ప్రధాన సామాజిక సమస్యగా స్త్రీని ఒక భోగ వస్తువగా మాత్రమే చూస్తున్నారు. వారికి బాధలు, కష్టాలు ఉంటాయని గుర్తించని సమాజంలో ఉన్నామని చూపడం జరిగింది. ఆ యువతిలోని బాధను, విషాదాన్ని గుర్తించలేని సంస్కారహీనులైన నలుగురు యువకులు ఆమెను లోబరుచుకోవడానికి ప్రయత్నం చేస్తారు. ఆ యువకులు సమాజంలో బాగా పలుకుబడి, హోదా కలిగిన అధికారులు, వ్యాపార పిల్లలు. ఈ విషయం అక్కడికి వచ్చిన కానిస్టేబుల్ వాళ్ళ పెద్దల దుష్కార్యాలను పొగుడుతూ చెప్పడం వల్ల తెలుస్తుంది.

### 4. ముగింపు

రావిశాస్త్రి నవలల్లో, కథల్లో, నాటకాల్లో కనిపించే పాత్ర వైవిధ్యం తెలుగులో చాలా తక్కువమంది రచనలలో కనిపిస్తుంది. మధ్యతరగతివాళ్ళు, కిందితరగతివాళ్లు రావిశాస్త్రి రచనల్లో కనిపిస్తారు. సంభాషణల ద్వారా, వ్యాఖ్యానాల ద్వారా, వర్ణనల ద్వారా కూడా పాత్రల స్వభావాలను, ప్రవృత్తుల్ని చిత్రించడంలో గురజాడ తరువాత రావిశాస్త్రినే చెప్పుకోవాలి. ఇది ఆయన పరిశీలనాశక్తి ద్వారానే సాధ్యమయింది. గురజాడ ప్రధానంగా నాటకకర్త. పాత్ర స్వభావాలను చెప్పడానికి సంభాషణలే ఆయనకు సాధనాలైనాయి. కథకుడుగా రావిశాస్త్రి అన్నిరకాల సాధనాలను ఉపయోగించుకున్నాడు. రావిశాస్త్రి రచనలలో మనం రోజూ చూసే సాధారణ మానవులు కనిపిస్తారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

**5. ఉపయుక్త గ్రంథ సూచి**

అప్పారావు, పోణంగి .1967 .***తెలుగునాటక వికాసము*** .సికింద్రాబాదు:నాట్యమాల ప్రచురణము, శివాజీ ప్రెస్.

నరసింహారావు, అత్తలూరి. 1977. ***రావిశాఖీయం***. విజయవాడ: సోమేశ్వర ప్రింటింగ్ హౌస్.

నాగయ్య,జి .1996.***తెలుగు సాహిత్య సమీక్ష*** .హైదరాబాద్ :నవ్య పరిశోధన ప్రచురణలు కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.

మూర్తి, వివిన(సం)+ రాయుడు, ఎం. వి(సం). 2007. ***రాచకొండ విశ్వనాథశాస్త్రి రచనా సాగరం.*** బెంగుళూరు: రాచకొండ ప్రచురణలు.

రంగనాథాచార్యులు ,కె.కె.2000 .***రాచకొండవిశ్వనాథ శాస్త్రి***.న్యూఢిల్లీ :సాహిత్య అకాడెమీ, సత్యశ్రీ ప్రింటర్స్.

వెంకట రామ నరసింహం, కాకర్ల .1979. ***సాహిత్య దర్శనము*** .విజయవాడ :క్వాలిటీ పబ్లిషర్స్.